క్లుప్తంగా

విద్యార్థుల అవగాహన ర్యాలీ



కొల్లిపర: మండలంలోని వివిధ స్కూల్ కాంప్లెక్స్‌లో ఆజాదీకా మహోత్సవ్‌లో భాగంగా నా మట్టి –నా దేశం కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. విద్యార్థులు సంప్రదాయ దుస్తులు ధరించి జాతీయ జెండాలతో ప్రధాన రహదారుల వెంట ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ వి.విజయలక్ష్మి మాట్లాడుతూ ఇటు వంటి కార్యక్రమాలు ప్రాథమిక పాఠశాల స్థాయిలో నిర్వహించడం వలన చిన్నారులల్లో జాతీయ సమైక్యత పెంపొందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ– 2 ఝాన్సీలత, మాజీ ఎంపీటీసీ భీమవరపు సంజీవరెడ్డి, విశ్రాంత ఎంఈఓ బసవకుటుంబరెడ్డి, సీఆర్‌పీ రమేష్ పాల్గొన్నారు.

వ్యర్థాలను కాలువలో వేయవద్దు



తెనాలిఅర్బన్: ఇళ్లు, దుకాణాల్లో ఉత్పత్తి అయిన వ్యర్థాలను చెరువులో వేయడం వలన నీరు కలుషితం అవడంతో పాటు దుర్వాసన వచ్చే అవకాశం ఉందని మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఆకురాతి రామచంద్రరావు పేర్కొన్నారు. స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంలో భాగంగా రజక చెరువులో పేరుకుపోయిన వ్యర్థాలను మంగళవారం మున్సిపల్ సిబ్బంది తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యర్థాలను కార్మికులకు అందజేయాలని కోరారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ గుమ్మడి ప్రసాద్, శానిటేషన్ సెక్రటరీలు ఎస్.ప్రవీణ్‌కుమార్, ఎ.ఉమామహేశ్వరరావు, కె.నాగరాజు, పి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం



తెనాలిఅర్బన్: రక్తదానం చేయడం వలన ప్రాణాలను కాపాడవచ్చని వైద్యులు డాక్టర్ పావని ప్రియాంక, డాక్టర్ జానీ పేర్కొన్నారు. రెడ్‌క్రాస్ సొసైటీ తెనాలి శాఖ–కాలేజ్ యూత్ రెడ్‌క్రాస్ సంయుక్త ఆధ్వర్యంలో జేఎంజే కళాశాలలో మంగళవారం సాయంత్రం రక్తదానం చేయడం వలన కలిగే ప్రయోజనాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. వారు మాట్లాడుతూ రక్తదానం చేయడం వలన అనేక ప్రయోజనాలు ఉన్నాయని చెప్పారు. రక్తశాతాన్ని పెంచుకునే విధానాలను వివరించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ కార్యదర్శి భానుమతి, జేఎంజే యూత్ రెడ్‌క్రాస్ కన్వీనర్ పాటిబండ్ల హేమలత, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ అరుణ సుజాత పాల్గొన్నారు.

కాలుష్య నివారణకు కృషి చేయాలి



తెనాలిఅర్బన్: వాతావరణ కాలుష్య నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని నెహ్రూ నికేతన్ విద్యాసంస్థల మేనేజింగ్ డైరెక్టర్ దాసరి మురళీకాంత్ కోరారు. ప్రపంచ పర్యావరణ, ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని బోసు రోడ్డులోని నెహ్రూనికేతన్ పాఠశాలలో మంగళవారం ఏర్పాటు చేసిన ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బావితరాల భవిష్యత్ కోసం ప్రకృతిని పరిరక్షించాల్సిన అవసరం అందరిపై ఉందని చెప్పారు. కార్యక్రమంలో విద్యాసంస్థల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డి.గీతాకాంత్, పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వీడియోగ్రాఫర్ మల్లి సేవలు మరువలేనివి



తెనాలిఅర్బన్: ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వీడియోగ్రాఫర్స్ అండ్ ఫోటోగ్రాఫర్స్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు పుట్లగుంట మల్లికార్జునరావు సంతాప సభను మంగళవారం కొత్తపేటలోని ఎన్‌జీవో హోంలో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అసోసియేషన్ అభివృద్ధికి ఆయన చేసిన కృషిని కొనియాడారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు ఫ్రాంక్లిన్, ఎస్‌బీఐ గంగానమ్మపేట బ్రాంచ్ మేనేజర్ విష్ణు, రూరల్ ఎస్ఐ వెంకటేశ్వర్లు, అసోసియేషన్ నాయకులు సుబ్రహ్మణ్యం, చిలుమూరు బాబీ, రాఘవ పాల్గొన్నారు.

వినాయకుడికి ప్రత్యేక పూజలు

తెనాలిఅర్బన్: వినాయక చవితి ఉత్సవాలను వైఎస్సార్ సీపీ నాయకులు తిరుమలశెట్టి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నాజరుపేటలోని సంకావారి కోట్ల బజార్‌లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. స్వామివారికి పూజలు చేశారు. అనంతరం అన్న సంతర్పణ నిర్వహించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు కొమరబత్తిని జయపాల్, దాసరి వసంత రావు, కఠారి రత్నకుమారి, వైఎస్సార్ సీపీ నాయకులు మద్దాలి శేషాచలం, కాళిదాసు వెంకటేశ్వరరావు, కోలా వాసు, కొల్ల గురనాథ గుప్తా, చుండూరు సాయి తదితరులు పాల్గొన్నారు.

గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా రామలింగేశ్వరపేటలోని గురవయ్య కాలనీలో ఏర్పాటు చేసిన విఘ్నేశ్వరునికి మంగళవారం పూజలు నిర్వహించారు. అనంతరం అన్నసంతర్పణ నిర్వహించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ కఠారి రత్నకుమారి, వైఎస్సార్ సీపీ నాయకులు కఠారి హరీష్, న్యాయవాది హరిదాసు గౌరిశంకర్, మామిడిబత్తుల సుబ్రమణ్యం, ఎంపీటీసీ మైలా భాను, అన్వేష్, వెనిగళ్ల రాఘవయ్య, బండారు రవికాంత్, నాగేశ్వరరావు, పాల్గొన్నారు.



చామంతి పూలతో స్వామికి పూజలు



రామలింగేశ్వరపేటలోని గురవయ్య కాలనీలో విఘ్నేశ్వరునికి పూజలు

లక్ష చామంతి పూలతో..

తెనాలిటౌన్: వినాయక చవితి పండుగ సందర్భంగా పట్టణ మారీసుపేటలోని చంద్రమౌళేశ్వరస్వామి ఆలయంలో ఏర్పాటు చేసిన గణేష్ విగ్రహం వద్ద భక్తులు విశేష పూజలు చేశారు. గణనాథునికి మంగళవారం లక్ష చామంతి పూలతో పూజలు చేశారు. అనంతరం విఘ్నేశ్వర స్వామికి శాంతి కల్యాణం జరిపారు. బుధవారం ఉదయం స్వామివారికి గ్రామోత్సవం (ఊరేగింపు) జరుగుతుందని కమిటీ సభ్యులు తెలిపారు.

ఉత్సాహంగా స్కూల్ గేమ్స్

- ప్రారంభించిన ఉప విద్యాశాఖాధికారి ఎస్.వెంకటేశ్వరరావు
- అట్టహాసంగా ప్రారంభమైన నియోజకవర్గస్థాయి ఎంపికలు



వాలీబాల్ ఆడుతున్న క్రీడాకారులు

ప్రత్తిపాడు: నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడులోని భవనం వెంకటరెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ గేమ్స్ నియోజకవర్గ స్థాయి ఎంపికలు అట్టహాసంగా ఆరంభమయ్యాయి. రెండు రోజుల పాటు జరగనున్న పోటీలను తొలిరోజు జిల్లా ఉప విద్యాశాఖాధికారి ఎస్.వెంకటేశ్వరరావు ప్రారంభించారు. క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. అనంతరం వాలీబాల్, కబడ్డీ, షటిల్ ఆడి ఎంపికలను ప్రారంభించారు. మంగళవారం ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, బాల్ బ్యాడ్మింటన్, త్రో బాల్, టెన్నికాయిట్, షటిల్ బ్యాడ్మింటన్, యోగా ఎంపికలు అండర్–14, అండర్–17 విభాగాల్లో బాలబాలికలకు వేర్వేరుగా జరిగాయి. నియోజకవర్గంలోని ప్రత్తిపాడు, పెదనందిపాడు, కాకుమాను, గుంటూరురూరల్, వట్టిచెరుకూరు మండలాల్లో మండల స్థాయి ఎంపికల్లో ఎంపికైన సుమారు 250 మంది క్రీడాకారులు పోటీల్లో పాల్గొని తమ సత్తాను చాటారు. ఉదయం ఓ మోస్తరు వర్షంతో ఆటంకం కలిగినప్పటికీ, మధ్యాహ్నం వర్షం లేకపోవడంతో క్రీడాకారులు ఉల్లాసంగా, ఉత్సాహంగా పోటీల్లో పాల్గొన్నారు.



వాలీబాల్ ఆడి పోటీలను ప్రారంభిస్తున్న ఉప విద్యాశాఖాధికారి వెంకటేశ్వరరావు

ప్రతిభను వెలికి తీసేందుకు..

విద్యార్థులలో అంతర్లీనంగా దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు అధిక ప్రాధాన్యతను ఇస్తుందని జిల్లా ఉపవిద్యాశాఖాధికారి ఎస్.వెంకటేశ్వరరావు అన్నారు. ముఖ్య అతిథిగా హాజరై క్రీడలను ప్రారంభించిన ఆయన క్రీడాకారులను ఉద్దేశించి ప్రసంగించారు. విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. ఆటల్లో గెలుపోటములను స్పోర్టివ్‌గా తీసుకోవాలని, క్రీడల్లో రాణిస్తే భవిష్యత్ బాగుంటుందని చెప్పారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి సీహెచ్. రమాదేవి, హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు హెచ్. శ్రీనివాసరావు, మండల స్పోర్ట్స్ కో ఆర్డినేటర్ డేవిడ్ రాజు, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా సెక్రటరీ జి.ప్రతాప్‌రెడ్డి, మాజీ సెక్రటరీ పేరం మస్తాన్ రెడ్డి, పీడీలు, పీఈటీలు పాల్గొన్నారు.

మహిళలు రక్తహీనతను అధిగమించాలి

ఐసీడీఎస్ సెక్టార్ సూపర్‌వైజర్ ఎం.వెంకటరత్నం

ప్రత్తిపాడు: మహిళల్లో రక్తహీనతతో అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని ఐసీడీఎస్ ప్రత్తిపాడు సెక్టార్ సూపర్‌వైజర్ ఎం.వెంకటరత్నం అన్నారు. పోషకాహార మాసోత్సవాలలో భాగంగా మంగళవారం ప్రత్తిపాడు సెక్టార్‌లోని నిమ్మగడ్డవారిపాలెం, గొట్టిపాడు సెక్టార్‌లోని గొట్టిపాడు డీడబ్ల్యూ అంగన్‌వాడీ కేంద్రాలలో మహిళలు, గర్భిణులు, బాలింతలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ముఖ్యంగా గర్భిణులు రక్తహీనతను అధిగమించేందుకు ఆకుకూరలు, పండ్లు అధికంగా తినాలన్నారు. ఎప్పటికప్పుడు ఆరోగ్య పరీక్షలు చేయించుకుంటూ ప్రసవం అయ్యే వరకూ జాగ్రత్తగా ఉండాలని సూచించారు. సూపర్‌వైజర్ అరుణ మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు హెచ్‌బీ పరీక్షలు చేయించుకుని వైద్యుల సలహా మేరకు తగు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎస్.కళాధర్, అంగన్‌వాడీ కార్యకర్తలు ద్వారక, మహిళలు పాల్గొన్నారు.



ఆకుకూరల వినియోగంపై అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ వెంకటరత్నం

రాష్ట్రస్థాయి క్విజ్ పోటీలకు ముట్లూరు హైస్కూల్ విద్యార్థిని

ప్రత్తిపాడు: రాష్ట్రస్థాయి క్విజ్ పోటీలకు ముట్లూరు హైస్కూల్ విద్యార్థిని ఎంపికయ్యింది. గ్రామీణ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ప్రముఖ ఐటీ కంపెనీ టీసీఎస్ జాతీయ స్థాయిలో ఐటీ రూరల్ క్విజ్ –2023 పోటీలను నిర్వహిస్తోంది. అందులో భాగంగా మంగళవారం గుంటూరులోని డీసీఈబీ సెమినార్ హాలులో డీఈఓ, డీఎస్‌వోల ఆధ్వర్యంలో జిల్లా స్థాయి క్విజ్ పోటీలు జరిగాయి. అందులో వట్టిచెరుకూరు మండలం ముట్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 9వ తరగతి విద్యార్థిని ఎం.గ్రీష్మాచౌదరి ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయింది. ఈ సందర్భంగా బాలికను, శిక్షణ ఇచ్చిన సైన్స్ ఉపాధ్యాయుడు వి.ఎస్.రామాంజనేయులును పాఠశాల హెచ్‌ఎం టి.జోస్‌మేరి, ఉపాధ్యాయులు అభినందించారు. అక్టోబరు నాలుగో తేదీన జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో గ్రీష్మా పాల్గొననున్నట్లు రామాంజనేయులు తెలిపారు.



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన గ్రీష్మాచౌదరిని అభినందిస్తున్న పాఠశాల హెచ్‌ఎం జోస్‌మేరి

చెడు అలవాట్లకు బానిసలుగా మారితే అంధకారం

- గంజాయి ఇతర మత్తుపదార్థాలతో పట్టుపడితే చట్టరీత్యా చర్యలు
- ఎస్ఈబీ సీఐ మారయ్యబాబు

తాడికొండ: విద్యార్థి దశలో చెడు అలవాట్లకు బానిసలుగా మారితే జీవితం అంధకారం అవుతుందని ఎస్ఈబీ సీఐ మారయ్య బాబు అన్నారు. మంగళవారం తాడికొండలోని కళాశాల బాలుర వసతి గృహంలో నిర్వహించిన అవగాహన సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. జీవితంలో ప్రతి ఒక్కరికీ విద్యార్థి దశ కీలకమైనది అని ఈ దశలో చదువును వదిలి గంజాయి, మద్యం ఇతర డ్రగ్స్‌కు అలవాటు పడి చాలామంది యువకులు భావి జీవితాన్ని కోల్పోతున్నారన్నారు. చెడు అలవాట్ల నుంచి విద్యార్థులను దూరం చేసేందుకు కళాశాలలో పాఠశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఎవరైనా మత్తు పదార్థాలతో పట్టుపడితే చట్టరీత్యా కఠిన శిక్షలు ఉంటాయని సూచించారు. పాఠశాలలో కళాశాలల్లో ఎవరైనా మత్తు పదార్థాలకు బానిసలుగా మారి ఉంటే తమ దష్టికి తీసుకురావాలని సూచించారు. తల్లిదండ్రులు కష్టపడి రెక్కలు ముక్కలు చేసుకుని చదివిస్తున్నారని వారి కష్టానికి తగిన ప్రతిఫలం ఇచ్చేలా విద్యార్థులు కష్టపడితే భవిష్యత్తులో ఉన్నత శిఖరాలు అధిరోహించి స్థిరపడవచ్చు అన్నారు. విద్యార్థులతో మత్తు పదార్థాలకు దూరంగా ఉంటామని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎస్ఈబీ ఎస్ఐ మల్లికార్జున్, సిబ్బంది రమేష్, నాగరాజు, వసతిగృహం వార్డెన్ నరేష్ పలువురు సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఈబీ సీఐ మారయ్య బాబు

ఎస్పీ బాలుకు ఘన నివాళి

లక్ష్మీపురం: ఐదు దశాబ్దాలుగా గానామృతంతో సంగీత ప్రియులకు తన దైన శైలిలో అనేక రకాల భాషలలో పాటలను ఆలపించిన గాన గంధర్వుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం అని సంస్థ కార్యదర్శి కొండాశివ రామిరెడ్డి, మేధావుల ఫోరం కన్వీనర్ పి.ఎస్.మూర్తి అన్నారు. స్థానిక అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో మంగళవారం గాన గంధర్వుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం వర్ధంతి ఘనంగా నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ ఎస్పీ బాలు బహుముఖ ప్రజ్ఞాశాలి నేపథ్య గాయకుడు సంగీత దర్శకుడు నటుడు, డబ్బింగ్ ఆర్టిస్ట్‌గా పేరొందన్నారు. ఇంజినీర్ పి.ఘన శ్యామాచార్యులు మాట్లాడుతూ తెలుగు, తమిళ, కన్నడ, హిందీ వంటి పలు భాషల్లో సుమారు 40 వేల కు పైగా పాటలు పాడారని గుర్తు చేశారు.

చల్లావారిపాలెం క్లాప్ మిత్రకు సత్కారం



శ్రీలక్ష్మిని సన్మానిస్తున్న రాష్ట్ర ఉన్నతాధికారులు

గుంటూరు రూరల్: మండలంలోని చల్లావారిపాలెం గ్రామ క్లాప్ మిత్ర గోగుల శ్రీలక్ష్మికి రాష్ట్ర ఉన్నతాధికారుల నుంచి ఘన సత్కారం లభించింది. తాడేపల్లిలోని పంచాయతీరాజ్ కమిషనర్ కార్యాలయంలో జరిగిన స్వచ్ఛతాహి సేవా కార్యక్రమంలో ఉత్తమ సేవలు అందించిన సఫాయ్ మిత్ర, క్లాప్ మిత్రలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో భాగంగా ఉత్తమ సేవలు అందించిన చల్లావారిపాలెం క్లాప్ మిత్ర శ్రీలక్ష్మిను పంచాయతీరాజ్ శాఖ స్పెషల్ ప్రిన్సిపల్ సెక్రటరీ బి.రాజశేఖర్, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఎంపీ గంధం చంద్రుడు శాలువాలను కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా చల్లావారిపాలెం గ్రామంలో జరిగిన కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఆరుదల సాంబశివరావు, గ్రామ సచివాలయం సిబ్బంది, వలంటీర్లు సత్కారం అందుకున్న క్లాప్ మిత్రకు అభినందనలు తెలిపారు.

30న జిల్లా కలెక్టరేట్ల ఎదుట ఏపీటీఎఫ్ ధర్నాలు

గుంటూరు ఎడ్యుకేషన్: ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారానికి ఈనెల 30న జిల్లా కలెక్టరేట్ల ఎదుట ధర్నా చేపడుతున్నట్లు ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షురాలు చెన్నుపల్లి మంజుల తెలిపారు. మంగళవారం జిల్లా కోర్టు ఎదుట ఉన్న ఏపీటీఎఫ్ జిల్లా కార్యాలయంలో ధర్నాకు సంబంధించిన కరపత్రాలు విడుదల చేశారు. ఏపీటీఎఫ్ రాష్ట్ర పూర్వ ప్రధాన కార్యదర్శి పాండురంగ వరప్రసాదరావు, సంఘ గుంటూరు జిల్లా అధ్యక్షుడు కె.బసవలింగారావు, ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ ఖాలీద్, నాయకులు జోసెఫ్ కిరణ్, పసుపులేటి శ్రీను, వందనం, సత్యనారాయణమూర్తి, సాయి, శివశంకర్, లక్ష్మీనారాయణ, జ్యోతి పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం

తెనాలిఅర్బన్: కాకాని సరోజని జ్ఞాపకార్థం ఆమె కుటుంబ సభ్యుల సహకారంతో రైల్వేస్టేషన్ రోడ్డులోని శ్రీ శివలింగేశ్వరస్వామి భక్త బృంద సేవా సమితి అన్నదాన కేంద్రంలో మంగళవారం పేదలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో కొలకలూరు మాజీ సర్పంచి ఉన్నం షకీలా, వి.యెహెజ్కేల్, కసుకుర్తి సరిత, బబ్లూ, కుర్రా శ్రీను పాల్గొన్నారు.

ఆశ్రమంలో వృద్ధులకు..

తెనాలిటౌన్: నాజరుపేటలోని మన ఇల్లు వృద్ధాశ్రమం, బుర్రిపాలెం రోడ్డులోని మహాత్మా సేవా శాంతి ఆశ్రమంలో మంగళవారం వెంకటేశ్వర యోగ సేవా కేంద్రం ఆధ్వర్యంలో వృద్ధులకు అన్నదానం చేశారు. యోగా సభ్యులు పోలిపల్లి బూసిరయ్య భార్య జీవామృతకళ వర్ధంతి సందర్భంగా సేవా కార్యక్రమం నిర్వహించారు. ఎస్వీ యోగా కన్వీనర్ ఎం.రమణయ్య అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో వేణు, ఝాన్సీ రాణి పాల్గొన్నారు.

వీరనారి చాకలి ఐలమ్మ

తెనాలి: భూమి కోసం, భుక్తి కోసం, దోపిడీ, పీడన నుంచి విముక్తి కోసం నాటి సాయుధ రైతాంగ పోరాటంలో దొరలను ఎదిరించి నిలిచిన చాకలి ఐలమ్మ చిరస్మరణీయురాలని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు అన్నారు. వీరనారి చాకలి ఐలమ్మ జయంతిని మంగళవారం బీసీ సంక్షేమ సంఘం, తెనాలి నియోజకవర్గం అధ్యక్షుడు జొన్నాదుల వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. స్థానిక రజక చెరువు పార్కులోని ఐలమ్మ కాంస్య విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. అనంతరం శంకరరావు మాట్లాడుతూ తెలంగాణలో పేద వర్గాల హక్కుల కోసం జరిగిన పోరాటంలో ఐలమ్మ పోషించిన ప్రముఖ పాత్రను వివరించారు. నేటితరం ఐలమ్మను స్ఫూర్తిగా తీసుకోవాలని, ప్రజల కోసం పాటుపడాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ఐలమ్మ జయంతిని అధికారికంగా నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. సంఘ రాష్ట్ర కార్యదర్శి అన్నవరపు మల్లేశ్వరరావు, యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.హనుమంతరావు, సంఘ పట్టణ అధ్యక్షుడు కుర్రా శ్రీను, ద్వారకా శ్రీను పాల్గొన్నారు.



పార్కులోని ఐలమ్మ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న బీసీ నేతలు

కొనసాగుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే

తెనాలిఅర్బన్: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి సంబంధించిన ఇంటింటి సర్వే తెనాలిలో విస్తృతంగా నిర్వహిస్తున్నారు. మంగళవారం ఉదయం కొత్తపేట, గంగానమ్మపేట పరిధిలోని ఆరోగ్య సి బ్బంది ఇంటింటికి వెళ్లి కుటుంబ సభ్యుల ఆరోగ్య సమస్యలపై ఆరా తీశారు. బీపీ, షుగర్, హిమో గ్లోబిన్ వంటి టెస్టులను చేశారు. దీర్ఘకాలిక వ్యాధు లతో బాధపడే వారిని గుర్తించి వారి వివరాలను యాప్‌లో నమోదు చేశారు. వచ్చే నెల ఐదో తేదీ నుంచి నిర్వహించనున్న ఉచిత వైద్య శిబిరాలకు వారిని తీసుకువెళ్లి పరీక్షలు చేయించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ మాలే పాటి హరిప్రసాద్, ఆరోగ్య విస్తరణాధికారి అందె బాలచంద్రమౌళి పాల్గొన్నారు.



మహిళకు పరీక్షలు చేస్తున్న ఆరోగ్య సిబ్బంది

రేపు జాషువా జయంతి

తెనాలి: గుర్రం జాషువా విజ్ఞాన సమితి, తెనాలి ఆధ్వర్యంలో ఈనెల 28వ తేదీన నవయుగ కవి చక్రవర్తి జాషువా 128 జయంతిని నిర్వహించనున్నారు. స్థానిక ఎన్జీవో కల్యాణమండపంలో సాయంత్రం 6 గంటలకు నిర్వహించనున్న సభలో జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా, ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్, రాష్ట్ర మండల విద్యాశాఖాధికారుల సంఘం అధ్యక్షుడు ఆదూరి వెంకటరత్నం, ఆచార్య నాగార్జున యూనివర్సిటీ అసిస్టెంట్ రిజిస్ట్రార్ పి.రాజగోపాల్ సహా పలువురు ప్రముఖులు పాల్గొంటారని నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. తొలుత సాయంత్రం 4–6 గంటల మధ్య కళాకారులతో జాషువా పద్యగానం ఉంటుందని చెప్పారు. ఉదయం 9 గంటలకు స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉన్న జాషువా విగ్రహానికి పుష్పాంజలి సమర్పిస్తారని సమితి అధ్యక్షుడు జుజ్జవరపు న్యూటన్ తెలిపారు.

ఫోన్ చేసుకుంటానని చెప్పి ఉడాయించాడు

మంగళగిరి: నగరంలో రెండు సెల్‌ఫోన్‌లు చోరీకి గురైన ఘటనలు మంగళవారం చోటు చేసుకున్నాయి. పోలీసులు తెలిపిన వివరాలు.. అనంతపురం నుంచి పానకాల లక్ష్మీనృసింహస్వామి కొండకు వచ్చిన భక్తుడు రంగయ్యను ఓ యువకుడు గుడికి వచ్చిన తమ వారు కనిపించడం లేదని ఒకసారి ఫోన్ ఇస్తే ఫోన్ చేసుకుని ఇస్తానని చెప్పి ఫోన్ తీసుకున్నాడు. రంగయ్య తమ కుటుంబ సభ్యులతో మాట్లాడుతుండగా యువకుడు సెల్‌ఫోన్‌తో పరారయ్యాడు. కంగుతిన్న రంగయ్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. పట్టణంలోని హుస్సేన్ కట్ట వద్ద యువకుడు పడిపోతున్నట్లు నటించగా స్థానికంగా ఉంటున్న మద్ది శివప్రసాద్ పట్టుకునేందుకు ప్రయత్నించాడు. యువకుడు శివప్రసాద్ జేబులోని ఫోన్ లాక్కుని పరారయ్యాడు. ఈ సంఘటనపై బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదులు అందుకున్న పోలీసులు కేసులు నమోదు చేసి సీసీ కెమెరా పుటేజీల ఆధారంగా దర్యాప్తు చేపట్టి దుండగులను పట్టుకునేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

ద్విచక్ర వాహనం చోరీ

నగరంలోని కొత్తపేటలో ఇంటి ముందు పార్కింగ్ చేసిన ద్విచక్రవాహనం చోరీకి గురైన ఘటన చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు కొత్తపేటకు చెందిన నవీన్ సోమవారం రాత్రి తన ఇంటి ముందు ద్విచక్రవాహనం పార్కింగ్ చేసి మంగళవారం ఉదయం లేచి చూడగా ద్విచక్రవాహనం కనిపంచలేదు. దీంతో నవీన్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేసినట్లు తెలిపారు.

కేఎల్‌యూలో ఘనంగా కుమార్తెల దినోత్సవం

తాడేపల్లిరూరల్: కేఎల్ విశ్వవిద్యాలయంలో కుమార్తెల దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. మహిళాభివృద్ధి సెల్ కన్వీనర్ డాక్టర్ కె.రూతు రమ్య మాట్లాడుతూ ఆడపిల్ల లేనిదే సృష్టి లేదన్నారు. తల్లిదండ్రులను ప్రేమగా చూసుకోవడంలో కూతుర్లదే పైచేయి అని అన్నారు. ఆడ, మగా తేడా లేకుండా టెక్నాలజీతో దూసుకుపోతున్న ఈ రోజుల్లో ఆడపిల్లలు లేని లోటు ఎవరూ తీర్చలేనిదని అన్నారు. ఎంతోమంది కుమార్తెలు తల్లిదండ్రులు గర్వపడేలా విజయాలు సాధించడమే కాకుండా, తమ కుటుంబాలకు ఆసరాగా నిలుస్తున్నారని అన్నారు. అనంతరం బాలబాలికలకు వివిధ రకాల ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో వర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారథి వర్మ, ప్రొ వైస్ చాన్సలర్లు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, ఎన్. వెంకటరామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, విద్యార్థి సంక్షేమ విభాగాధిపతి డాక్టర్ చప్పిడి హనుమంతరావు, ప్రొఫెసర్ సుభాకర్‌రాజు, మహిళా అభివృద్ధి సెల్ కో కన్వీనర్లు డాక్టర్ కె.సోని, కో ఆర్డినేటర్ కోనేరు శిరీష, వి.సాహితి, మొహమ్మద్ షేక్ తదితరులు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న అధ్యాపకులు

గ్రంథాలయానికి పుస్తకాల వితరణ



మంగళగిరి: నగరంలోని రాష్ట్ర గ్రంథాలయ పరిషత్‌కు 60 పుస్తకాలను రచయితలు అందజేశారు. మంగళవారం గ్రంథాలయ పరిషత్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో మానవత కన్వీనర్ తరిమెల అమరనాథరెడ్డి రచించిన 13వ పుస్తకం టైంపాస్ 50 కాపీలతోపాటు మేరా భారత్ మహాన్ పది కాపీలను అందజేశారు. గ్రంథాలయ పరిషత్ చైర్మన్ మందపాటి శేషగిరిరావు మాట్లాడుతూ అమరనాథరెడ్డి రచనా శైలి అత్యంత సామాన్యంగా ఉంటుందని, ముఖ్యంగా టైంపాస్ టులో అంధవిశ్వాసాలు, రుగ్మతలను నవ్వుతూ ఆలోచించే విధానం సామాజిక స్పృహ కలిగించే అంశాలన్నిటిని చాలా చిన్న పదాలతో సమాజంలో జరిగే సంక్లిష్టమైన సమస్యలకు సులువైన పరిష్కార మార్గాలకు అన్వేషించే విధంగా ఉన్నాయన్నారు. కార్యక్రమంలో మానవత కో కన్వీనర్ సలీం మాలిక్, డాక్టర్ బి జాన్‌ప్రసాద్, వైఎస్సార్ ఇంటలెక్చువల్ వ్యవస్థాపక సభ్యులు కందిపున్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.